

ఇందిరానగర్ ఫేజ్ -2లో సొంత డబ్బులతో బోరు వేయించు కుంటున్న బస్తీ వాసులు

## సొంత డబ్బులతో బస్తీలో బోరు

**యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి):** ప్రతియేడూ నీటి ఎద్దడిపై అధికారులకు, ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకుంటూ విసిగి వేసారిన బస్తీ వాసులు చివరకు సొంతంగా డబ్బు పోగేసుకుని బోరు వేసుకున్న సంఘటన ఎస్పీఆర్ హిల్స్ ఇందిరానగర్ పేజ్-2లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే ఈ ప్రాంతంలో వందకు పైగా కుటుంబాలు నివాసం ఉంటాయి. అయితే, వీరికి నల్లా నీరు లోప్రెషర్‌లో వస్తుంది. ఇక వేసవిలో వారి కష్టాలు వర్ణనాతీతం. నీటి సమస్యను పరిష్కరించండి అంటూ అధికారులకు, ప్రజాప్రతినిధులకు స్థానికులు అనేకసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. మళ్లీ వేసవికాలం సమీపిస్తుండడంతో బస్తీ వ్యవస్థాపక అధ్యక్షుడు యాదయ్య స్థానికులతో సమావేశం నిర్వహించి సొంతంగా డబ్బులు సమకూర్చుకుని బస్తీలో బోరు వేయాలని నిర్ణయించారు. ఈ మేరకు సాయిబాబా దేవాలయం వెనక 650 అడుగుల లోతు బోరును శనివారం వేయించారు. బోరు వేయడంతో బస్తీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

## నా స్థలంలో గోడ కట్టిన వారిపై చర్యలు తీసుకోండి

● టౌన్‌ప్లానింగ్ అధికారులకు మహిళ ఫిర్యాదు

**యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి):** 'నా స్థలంలో గోడ నిర్మిస్తూ అడిగితే దౌర్జన్యానికి పాల్పడుతున్నారు.. నాకు న్యాయం చేయండి సారూ' అంటూ ఓ మహిళ టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. రహ్మత్‌నగర్‌లో నివసించే అద్వాల శారదాబాయి తన స్థలంలో రేకుల షెడ్ వేసుకుని, తన ఇంటికి దక్షిణంవైపు కొంత స్థలం వదిలి డ్రైనేజీ ఏర్పాటు చేసుకుంది. అయితే, తన పక్కింటి వ్యక్తి ఇటీవల ఇంటి నిర్మాణం చేపట్టాడని తాను ఊరెళ్లిన సమయంలో తన స్థలంలో గోడ కట్టాడని తెలిపింది. పెద్ద మనషుల సమక్షంలో పంచాయితీ పెట్టగా పక్కింటి వ్యక్తి గోడ తీసేస్తానని అంగీకరించాడు. కొద్ది రోజుల తరువాత శారదాబాయి పక్కింటి వ్యక్తిని గోడ తొలగించాలని కోరగా 'నాకు కార్పొరేటర్ తెలుసు, మా అల్లుడు డీఎస్పీ, నా కూతురు జలమండలిలో పెద్ద అధికారి నీకు ఇష్టమొచ్చింది చేసుకో గోడ తొలగించనని దౌర్జన్యం చేస్తున్నాడు' అని బాధితురాలు వాపోయింది. ఈ మేరకు శారదాబాయి యూసుఫ్‌గూడ డీఎంసీ కార్యాలయంలో అసిస్టెంట్ టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసింది.

## సీపీ శ్రీనివాస్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

**బంజారాహిల్స్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి):** ప్రజావ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న పంజాగుట్ట పోలీసుస్టేషన్ సిబ్బందిని బదిలీ చేయడం హర్షణీయమని సమైక్యాంధ్ర సమితి అధ్యక్షుడు కుమార్‌చౌదరి యాదవ్ అన్నారు. 85 మంది సిబ్బందిని ఒకేసారి బదిలీ చేసిన నగర సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి చిత్రపటానికి పంజాగుట్ట చౌరస్తాలో శనివారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మారమోని శ్రీశైలంయాదవ్, కమలేష్, మండడి శ్రీనివాస్, గోపాలకృష్ణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## సికింద్రాబాద్ ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు

**బంజారాహిల్స్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి):** సికింద్రాబాద్ ఎంపీ టికెట్‌ను తనకు కేటాయించాలని కాంగ్రెస్ నేత, సీఏ వేణుగోపాల స్వామి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం గాంధీభవన్‌లో దరఖాస్తు అందజేశారు. తనకు అవకాశం ఇస్తే భారీ మెజారిటీతో గెలుస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈసారి జరిగే పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ స్థానంతో పాటు తెలంగాణలోని అన్ని పార్లమెంటు స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



గాంధీభవన్ అధికారులకు దరఖాస్తు అందజేస్తున్న కాంగ్రెస్ నేత వేణుగోపాలస్వామి

## డాక్టర్ రవీందర్ గౌడ్..

**సనత్‌నగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి):** సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా తనకు అవకాశం ఇవ్వాలని సరోజిని దేవి ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్ గౌడ్ కోరారు. ఈ మేరకు శనివారం గాంధీభవన్‌లో దరఖాస్తు సమర్పించారు. అనంతరం డాక్టర్ రవీందర్ గౌడ్ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే ఎంపీ అభ్యర్థిత్వం కోసం దరఖాస్తు చేశానన్నారు. బీసీ అభ్యర్థినైన తనకు టికెట్ కేటాయిస్తే భారీ మెజారిటీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.



దరఖాస్తు ఫారం చూపిస్తున్న డాక్టర్ రవీందర్ గౌడ్

## అంబేడ్కర్ వర్సిటీలో నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ

**హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి):** బోధనా రంగాల్లో మార్పులకు అనుగుణంగా ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ అకడమిక్ కౌన్సెలర్లు నైపుణ్యం పెంపొందించుకోవాలని డా.బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ వీసీ ప్రొ.కె.సీతారామారావు సూచించారు. డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ సెంటర్ ఫర్ స్టాఫ్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ (సి.ఎస్.టి.డీ) ఆధ్వర్యంలో అకడమిక్ కౌన్సెలర్ల కోసం నిర్వహించిన ఒక రోజు ఆన్‌లైన్ శిక్షణా కార్యక్రమాన్ని వీసీ ప్రారంభించారు. శిక్షణా కార్యక్రమంలో కృష్ణా విశ్వవిద్యాలయ మాజీ ఉపకులపతి, అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ మాజీ రెక్టార్ ప్రొ.వి.వెంకయ్య, సి.ఎస్.టి.డి డైరెక్టర్ ప్రొ.ఐ.ఆనంద్ పవార్, విశ్వవిద్యాలయ ఆచార్యులు, అధ్యాపకులు, వివిధ కళాశాలల అకడమిక్ కౌన్సెలర్లు పాల్గొన్నారు.

## రూకీస్ సర్టిఫైడ్ కాలేజీగా ఐఏసీజీ మల్టీమీడియా కాలేజీ

**హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి):** నగరానికి చెందిన ఇంటర్నేషనల్ అకాడమీ ఆఫ్ కంప్యూటర్ గ్రాఫిక్స్ (ఐఏసీజీ) ఇప్పుడు రూకీస్ సర్టిఫైడ్ స్కూల్‌గా ప్రపంచస్థాయి గుర్తింపు పొందింది. జూబ్లీహిల్స్‌లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఐఏసీజీ ఫౌండర్ రామకృష్ణ పోలిన మాట్లాడుతూ.. ఈ సర్టిఫికేషన్‌ను భారతదేశంలో సాధించిన ఒకే ఒక్క ఇనిస్టిట్యూట్‌గా తాము చరిత్ర సృష్టించామన్నారు.

## విదేశీ విద్యావకాశాలపై ఉచిత అవగాహన సదస్సు

**బంజారాహిల్స్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి):** బంజారాహిల్స్‌లోని తాజ్ డెక్కన్‌లో శనివారం ఐవీవై ఓవర్సీస్ ఆధ్వర్యంలో 'గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్-2024' పేరిట ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. సుమారు 1000మంది విద్యార్థులతో పాటు ఆయా యూనివర్సిటీల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారు. ఇలాంటి అవగాహనా సదస్సుల ద్వారా విద్యార్థులకు విదేశాల్లో ఉన్నత విద్యావకాశాల గురించి తెలుసుకోవడానికి చాలా ఉపయుక్తంగా ఉంటుందని ఐవీవై ఎండీలు గీరి శ్రీనివాసరావు బొంగరాల, రామ్ బొంగరాల తెలిపారు. కార్యక్రమంలో సేల్స్ హెడ్ శివశంకర్, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నిమ్స్‌లో చికిత్స పొందుతున్న భీమమ్మ కుటుంబ సభ్యులకు మంజూరైన రెండు లక్షల రూపాయల సీఎం రిలీఫ్‌ఫండ్ ఎల్‌ఓసీని అందజేస్తున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, బీఆర్ఎస్ నాయకుడు నగేష్‌సాగర్ తదితరులు

- బంజారాహిల్స్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి)

# ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

ఆదర్శంగా మోడల్ కాలనీ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యక్రమాలు

**స్నేహితులతో కలిసి మాట్లాడుకోవడం, ఆటలాడటం, యోగా, వ్యాయామాలు చేయడం కేవలం యువత మాత్రమే కాదు.. వయసు మళ్లిన వారు, రిటైరయి ఇంట్లో ఉంటున్న వారు కూడా చేయవచ్చు. కుటుంబ భారం మోసి, జీవిత చరమాంకంలో ఉన్నా వృద్ధాప్యం శరీరానికే కానీ, మనసుకు కాదని నిరూపిస్తున్నారు మోడల్ కాలనీ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు.**



కుర్చీ ఆట ఆడుతున్న మహిళలు



బ్రిస్క్‌వాక్ చేస్తున్న సీనియర్ సిటిజన్స్

**సనత్‌నగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి):** రిటైరయిపోతే జీవితం అయిపోయిందని భావించేవారికి నిత్యం ఆటపాటలో సందడి చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు మోడల్ కాలనీ సీనియర్ సిటిజన్స్. కుటుంబ సభ్యులు ఆఫీసులు, స్కూళ్లు, కాలేజీలకు వెళ్లిపోతే తమ ఒంటరి తనాన్ని దూరం చేసుకునేందుకు అందరూ ఒక్కచోట కలుస్తున్నారు. పిచ్చాపాటి మాటలతోపాటు చెస్, క్యారమ్స్ ఆడుతూ ఉల్లాసంగా గడుపుతున్నారు. కొందరు వ్యాయామం, యోగా చేస్తే మరికొందరు లైబ్రరీలో పుస్తకాలు, పత్రికలు, సాహిత్యం చదువుతూ జ్ఞానాన్ని పెంచుకుంటున్నారు. అత్యధిక వయసు ఉన్న వారి పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించడం తోపాటు వారికి మానసిక స్థైర్యాన్ని అందిస్తున్నారు.



వయోధికులకు సన్మానిస్తున్న సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు

### అందుబాటులో లైబ్రరీ

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్‌లో ఆటలతోపాటు విజ్ఞానాన్ని పెంచుకునేందుకు వీలుగా 2 వేల పుస్తకాలతో లైబ్రరీని ఏర్పాటు చేసుకున్నారు. సాహిత్యం, ఆధ్యాత్మికం, చరిత్ర పుస్తకాలు అందుబాటులో ఉంచారు. కాలనీ వాసుల్లో ముఖ్యంగా యవతలో పుస్తకపఠనాన్ని ప్రోత్సహించేందుకు పుస్తకాలను ఇంటికి తీసుకువెళ్లే అవకాశం కూడా కల్పించారు, లైబ్రరీలో దినపత్రికలు, మ్యాగజైన్‌లను చదువుతూ వార్తలపై తమ అభిప్రాయాలను పంచుకుంటారు. పుస్తకం మంచి నేస్తం అని, ప్రతి ఒక్కరూ పుస్తకపఠనాన్ని అలవర్చుకోవాలని సూచిస్తున్నారు.

### ఆటలతో ఉత్సాహంగా..

మోడల్ కాలనీ సీనియర్ సిటిజన్స్ ఆటలతో సందడి చేస్తున్నారు. చెస్, క్యారమ్స్ వంటి ఆటలతోపాటు మానసిక ఉల్లాసాన్ని కలిగించే బ్రిస్క్‌వాక్, టగ్‌ఆఫ్ వార్, జీకే, క్విజ్ ఆటలను ఆడుతున్నారు. కొంతమంది వాకింగ్ చేస్తే, మరి కొందరు ట్రెడ్ మిల్‌పై నడుస్తారు. వయసుకు తగిన విధంగా ఆట పాటలతో నిత్యం సరదాగా ఉంటున్నారు. ఏడాదికి రెండు సార్లు (జనవరి 26, ఆగస్టు 15)ఆసరా కమిటీ సహకారంతో ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. తమ కార్యకలాపాలను చూపుతూ ఇతర కాలనీల్లో కూడా ఇదే విధమైన అసోసియేషన్‌లు ఏర్పాటు చేసేందుకు సహకారం అందిస్తున్నారు.

### ఆత్మాభిమానంతో జీవించాలి



జీవితం మొత్తం కుటుంబం కోసం ధారపోసి వయసు మీదపడితే కుటుంబానికి భారం అవుతామన్న భావనలో కొంతమంది సీనియర్ సిటిజన్స్ ఉంటున్నారు. ఇది తప్పుడు ఆలోచన, వయోధికులు ఆత్మాభిమానంతో ఆనందంగా జీవించాలి. ఏ సమాజంలో వయోధికులు గౌరవం పొందుతూ ఆత్మాభిమానంతో జీవిస్తారో ఆ సమాజం అన్నిరంగాల్లో ముందంజలో ఉంటుంది. వయసుమళ్లిన వారిని గౌరవించే సాంప్రదాయం మనం ముందుతరాలకు నేర్పించాలి.

- జేఎస్‌టీ శాయి, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

### సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్‌కు సహకరిస్తా

● తలసాని శ్రీనివాస్ యాదవ్

మోడల్ కాలనీ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్‌కు అన్ని విధాల సహకరిస్తానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనవరి 26న నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు బహుమతులు శనివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ కాలనీ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ చేస్తున్న కార్యక్రమాలు ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లక్ష్మి, కొండల్ రావు, సాయి, డీపీ రెడ్డి, కృష్ణారెడ్డి, ప్రసాద్, కేవైడీ రెడ్డి, బుచ్చిబాబు పాల్గొన్నారు.



సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే తలసాని

### వయోధికులకు సన్మానం

మోడల్ కాలనీ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు వయసు మీదపడిన వారిని ప్రతి ఏటా సన్మానించుకుంటారు. వారిలో ఎప్పటి కప్పుడు ఉత్సాహాన్ని నింపుతున్నారు. వయసుమళ్లిన వారికి ఎలాంటి గౌరవం, అప్యాయత ఇవ్వాలో యువతకు నేర్పిస్తున్నారు. పుట్టిన రోజు వంటి వేడుకల్లో కుటుంబ సభ్యులు పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నారు. సమాజంలో వృద్ధులు తలెత్తుకొని ఎలా జీవించాలో చూపిస్తున్నారు.

## నిధులు లేక ప్రభుత్వ శాఖల్లో స్తంభిస్తున్న పనులు

● కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**బంజారాహిల్స్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి):** నిధులు లేక ప్రభుత్వ శాఖల్లో పనులు స్తంభించిపోతున్నాయని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. నిధులు లేక జలమండలి లాంటి శాఖలలో పనులు నిలిచిపోయాయని, జీహెచ్ఎంసీ పరిధిలో చిన్న కాంట్రాక్టర్‌కు కూడా డబ్బులు చెల్లించలేని పరిస్థితికి పాలన చేరుకుందని ఆందోళన వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఆయన శనివారం పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. రెహ్మత్‌నగర్ డివిజన్ బంగారు మైసమ్మ గుడి దగ్గర, ఎస్‌ఎస్‌బీనగర్ శివాలయం, బ్రాహ్మణ్‌వాడి బస్తీ, సైట్-3, ఎస్ఆర్‌టీనగర్, స్వరాజ్‌నగర్, వెంగళరావునగర్ డివిజన్ కృష్ణకాంత్ పార్కు, తదితర ప్రాంతాల్లో పవర్‌బోర్‌ల పనులను ప్రారంభించారు. ఇంద్రానగర్ ఫేజ్-1లో కమ్యూనిటీ హాల్, అంగన్‌వాడీ సెంటర్‌కు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ నగరానికి సంబంధించి కలెక్టర్ ఆధ్వర్యంలో ఓ కమిటీ ఏర్పాటు చేసి చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలపై ప్రణాళిక సిద్ధం చేశామని వివరించారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి నగర అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతంరావు, నాయకులు కుంభాల గంగరాజు, జూటూరి కీర్తిరెడ్డి, ప్రేంకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కమ్యూనిటీహాల్, అంగన్‌వాడీ సెంటర్ నిర్మాణం కోసం భూమి పూజ చేస్తున్న కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి

### ఎస్ఆర్‌టీ మార్కెట్‌లో తనిఖీ

బోరబండ ఎస్ఆర్‌టీలో ఉన్న కూరగాయల మార్కెట్‌ను కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సందర్శించారు. వ్యాపారులు, వినియోగదారుల వద్దకు వెళ్లి సమస్యలు, అడిగి తెలుసుకున్నారు. డిజిటల్ పేమెంట్‌ల గురించి ఆరా తీశారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఖాళీ స్థలంలో ఉన్న మార్కెట్‌ను గత ప్రభుత్వం రోడ్డు మీదకు తీసుకువచ్చిందని ఆరోపించారు. మార్కెట్ యథావిధిగా కొనసాగించేందుకు అధికారులతో మాట్లాడనున్నట్టు తెలిపారు.



ప్రాపర్టీ టాక్స్ వసూలు చేస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

## ప్రాపర్టీ టాక్స్ సకాలంలో చెల్లించండి

● డీఎంసీ సేవా ఇస్లావత్

**యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి):** ప్రాపర్టీ టాక్స్ సకాలంలో చెల్లించి ప్రభుత్వానికి సహకరించాలని డీఎంసీ సేవా ఇస్లావత్ ప్రజలను కోరారు. జీహెచ్ఎంసీ యూసుఫ్‌గూడ సర్కిల్-19 అధికారులు ప్రాపర్టీ టాక్స్ వసూలు చేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సర్కిల్ పరిధిలోని మొండి బకాయిదారులపై అపరాధ రుసుం వేయటంతోపాటు ఆస్తులు జప్తు చేయడానికి సిద్ధమయ్యారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**పంజాగుట్ట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి):** మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. గఫూర్ నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఒమ్రీస్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, వైష్ణవి, ఎన్.ఏ.సీ గ్రౌండ్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

### సైఫాబాద్ పరిధిలో..

సైఫాబాద్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ ప్రేమానంద్ పాయ్ తెలిపారు. టాటా టెలిసర్వీసెస్, రంగారెడ్డి జెడ్పీ కార్యాలయం, ఏజీ ఆఫీస్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, ఐసీ క్వార్టర్స్, ఆల్ ఇండియా రేడియో ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

## కుమారి ఆంటీని చుట్టుముట్టిన నిరుద్యోగులు

● సీఎం స్పందించేలా చూడాలని విజ్ఞప్తి

**రాయదుర్గం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి):** యుట్యూబ్‌లో వీడియోలతో ఫేమస్ అయిన ఫుడ్‌సెంటర్ నిర్వాహకురాలు కుమారి ఆంటీ ఫుడ్ సెంటర్ వద్దకు శనివారం పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు చేరుకున్నారు. ఈ సందర్భంగా నిరుద్యోగులు 'హైదరాబాద్ వాళ్లకు 40 మార్కులు వస్తే ఉద్యోగాలు ఇచ్చారు.. మాకు 130 మార్కులు వచ్చినా ఉద్యోగాలు రాలేదు'అని కుమారి ఆంటీకి వివరించారు. మాబాధలు ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు. 'మీరు ఒక్కమాట చెబితే సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. మా సమస్యపై మీరు మాట్లాడండి.. మాకు ఉద్యోగాలు వస్తాయి'అని ఆమెకు వినతి పత్రం ఇచ్చేందుకు ప్రయత్నించారు. జీవో 46 పై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని ఆమెను చుట్టుముట్టారు. ఈ సందర్భంగా కుమారి ఆంటీ మాట్లాడుతూ తనకు వీటి గురించి తెలియదని, సీఎం ప్రజా పాలకుడని ఆయనకు మనం చెప్పాల్సిన అవసరం లేదని, తనను ఇబ్బంది పెట్టవద్దని వేడుకుంది. 'త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి మీ దగ్గరకు వస్తున్నారు.. ఆ సమయంలో మా సమస్యలను సీఎంకు చెప్పి వినతిపత్రం ఇవ్వాలని' విజ్ఞప్తి చేశారు. అనంతరం అక్కడి నుంచి నిరుద్యోగులు వెళ్లిపోయారు.

## కార్పొరేట్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ షురూ

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** హైటెక్ సిటీలోని గేమ్ పాయింట్ అకాడమీ కార్పొరేట్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌కు ఆతిథ్యమిస్తోంది. సుమారు 150 మందికి పైగా షట్లర్లు పాల్గొనే ఈ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభమవనుంది. కార్పొరేట్ ఉద్యోగులకు పని ఒత్తిడి నుంచి ఉపశమనం కల్గించడంతో పాటు, ఫిట్‌నెస్, ఆరోగ్యం భద్రతపై అవగాహన కల్పించేందుకు ఐదో సీజన్‌ను నిర్వహిస్తున్నట్టు గేమ్ పాయింట్ సహ వ్యవస్థాపకుడు సిద్ధార్థ్ రెడ్డి తెలిపారు.

## హైదరాబాద్ గోల్ఫ్‌లో డీఎస్ఆర్ టీమ్ హవా

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ సీజన్-4లో డీఎస్ఆర్ జట్టు టాప్‌కు చేరుకుంది. శనివారం గోల్ఫ్ కోర్స్‌లో ముగిసిన నాలుగో రౌండ్ పోటీల్లో డీఎస్ఆర్ టీమ్ 659 పాయింట్లతో గ్రూప్-సిలో అగ్రస్థానంలో నిలిచింది. లీగ్‌లోని మిగిలిన జట్ల విషయానికొస్తే.. గ్రూప్-ఎలో సామా ఎంజెల్స్ (629 పాయింట్లు), గ్రూప్-బిలో టీమ్ ఆల్ఫా (622 పాయింట్లు), గ్రూప్-డిలో మీనాక్షి మావెరిక్స్ (600 పాయింట్లు) టాప్‌లో కొనసాగుతున్నాయి.



బహుమతులు అందుకున్న చిన్నారులతో అతిథులు, నిర్వాహకులు

## చదువుతో పాటు ఆటల్లో రాణించాలి

● బ్యాడ్మింటన్ క్రీడాకారుడు మనోజ్

**పంజాగుట్ట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి):** విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలని అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పి.మనోజ్ కుమార్ సూచించారు. మధురానగర్ కాలనీలోని దండు చిన్న సత్యనారాయణ రాజు ఇండోర్ స్టేడియం, జిమ్ 25వ వార్షికోత్సవాన్ని స్థానిక సాగి రామకృష్ణం రాజు కమ్యూనిటీ హాలులో ఘనంగా నిర్వహించారు. అనంతరం గణతంత్ర దినోత్సవం సందర్భంగా బాలబాలికలు, మహిళలకు, వయోవృద్ధులకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి కార్పొరేటర్ దేదీప్య, సినీనటులు శివాజీ రాజా, జె.రామకృష్ణ చౌదరిలతో కలిసి మనోజ్ కుమార్ బహుమతులను అందజేశారు. ఈ వేడుకల్లో సమితి అధ్యక్షుడు కోడె సాంబశివరావు, ఎం.కళ్యాణ్ చక్రవర్తి, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ రాజు, కోశాధికారి ఉప్పలయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.

## పెంచిన ఫీజులు తగ్గించాలి..

● కోఠి మహిళా విశ్వవిద్యాలయం ఎదుట ధర్నా
● దిగివచ్చిన వీసీ.. ఫీజులను తగ్గిస్తున్నట్లు ప్రకటన

**మంగళ్‌హాట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి):** పెంచిన ఫీజులను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ కోఠి మహిళా కళాశాల విశ్వవిద్యాలయం విద్యార్థినులు రోడ్డెక్కారు. శనివారం విశ్వవిద్యాలయం ప్రధాన గేటు వద్ద ధర్నా నిర్వహించారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీలో సైతం లేనివిధంగా కోఠి మహిళా విశ్వవిద్యాలయంలో పరీక్ష ఫీజులను 10 శాతం పెంచి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. మారుమూల ప్రాంతాల నుంచి చదువుల కోసం నగరానికి వచ్చిన విద్యార్థులపై ఫీజుల భారం మోపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కనీస సమాచారం లేకుండా ఏకంగా 10 శాతం ఫీజుల పెంచడం సరికాదన్నారు. పెంచిన ఫీజులను వెంటనే తగ్గించడంతోపాటు హాస్టల్‌లో వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం విశ్వవిద్యాలయం వీసీ విజ్జులత విద్యార్థులతో చర్చించి పెంచిన ఫీజులు తగ్గిస్తున్నట్లు ప్రకటించడంతోపాటు హాస్టల్‌లో వసతులు కల్పిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థినులు ధర్నా విరమించారు.



వర్సిటీ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థినులు

## కేన్సర్ కేసులు పెరుగుతున్నాయి

ఎఫ్‌టీసీసీఐలో కేన్సర్ సదస్సులో వైద్యులు

**హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి):** ప్రపంచవ్యాప్తంగా కేన్సర్ కేసులు పెరుగుతున్నాయని, భారతదేశంలో గత సంవత్సరం 19 నుంచి 20 లక్షల కేన్సర్ కేసులు నమోదయ్యాయని ఆంకాలజిస్ట్ డాక్టర్ కళ్యాణ్ పోలవరపు పేర్కొన్నారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా శనివారం రెడ్‌హిల్స్‌లోని ఎఫ్‌టీసీసీఐలో, మూడు సంస్థలు ఎఫ్‌టీసీసీఐ, తెలంగాణ లయన్స్ క్లబ్‌లు, తెలంగాణ, ఆంధ్రా ప్లాస్టిక్ తయారీదారుల సంఘం (టాప్మా)తో కలిసి ప్రపంచ కేన్సర్‌ని జయిద్దాం అనే థీమ్‌తో సెమినార్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ కళ్యాణ్ పోలవరపు మాట్లాడుతూ పశ్చిమ దేశాలలో లాగా మన దగ్గర కేన్సర్ జాతీయ రిజిస్ట్రీ లేదని, కాబట్టి కేసుల సంఖ్య కచ్చితంగా తెలియదని అన్నారు. నోటిలో పుండు మూడు వారాల్లో నయం కాకపోతే వైద్యులను సంప్రదించాలన్నారు. భారతదేశంలో కేన్సర్ స్క్రీనింగ్ 5 శాతం కంటే తక్కువగా ఉందని డాక్టర్ కళ్యాణ్ చెప్పారు. లయన్స్ క్లబ్‌ల అంతర్జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ పట్టి హిల్ మాట్లాడారు. కార్యక్రమంలో లయన్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఆర్.సునీల్ కుమార్, డాక్టర్ పవన్ కుమార్ బి, డాక్టర్ హరీష్ ఎన్ఎల్, డాక్టర్ ప్రనేత్, ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు మీలా జయదేవ్, టీఏపీఎంఏ అధ్యక్షుడు దయాకర్, శేఖర్ అగర్వాల్, లయన్ డాక్టర్ ప్రకాశరావు, లయన్ తీగల మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ కళ్యాణ్ పోలవరపు




ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

## రోగులకు పండ్లు పంపిణీ

**ఖైరతాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి):** ప్రపంచ కేన్సర్ డే సందర్భంగా ఐఐఎంసీ కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ వాలంటీర్లు ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె.రఘువీర్ మట్లాడుతూ పొగాకు, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండడం వల్ల కేన్సర్ బారిన పడకుండా ఉండవచ్చునన్నారు. ప్రభుత్వం పొగాకు ఉత్పత్తులను నిషేధించాలని కోరారు. వైస్ ప్రిన్సిపాల్ తిరుమలరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఎం.సత్యనారాయణ, రామకృష్ణ, విజయానంద్, దీపక్ పాల్గొన్నారు.

# న్యాయపోరాటం గెలిచింది

- కష్టపడ్డాం.. శ్రమించి పనిచేశాం
- కరోనా రోగులకు వైద్యం చేశాం
- గాంధీ ఔట్‌సోర్సింగ్ నర్సుల పర్మినెంట్‌తో ఆనందం


గాంధీ ఆస్పత్రి నర్సులు

**అడ్డగుట్ట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి):** పదిహేడేళ్లు కష్ట పడ్డాం, కరోనా సమయంలో కుటుంబాలకు దూరంగా ఉంటూ రోగులకు వైద్యం చేశాం, ఉద్యమాలు చేశాం, చివరకు న్యాయపోరాటం గెలిచిందని గాంధీ ఆస్పత్రి ఔట్‌సోర్సింగ్ సీనియర్ నర్సులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గాంధీ ఆస్పత్రిలో రెండు వందల మంది ఔట్‌సోర్సింగ్ నర్సులు 2007 నుంచి విధులు నిర్వహిస్తున్నారు. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను ప్రాణంగా చూసుకుని ప్రాణాలు నిలబెట్టే ఉద్యోగాలు చేశారు. ఇన్నేళ్లుగా పనిచేసిన ఔట్‌సోర్సింగ్ నర్సులకు ఈ కొత్త ప్రభుత్వంలో పర్మినెంట్‌తో ఊరట లభించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఔట్‌సోర్సింగ్ నర్సులకు నర్సింగ్ ఆఫీసర్లుగా నామకరణం చేసి హామీని నిలబెట్టుకున్నారు. చాలిచాలని జీతాలతో ఇన్నాళ్లుగా పనిచేశామని వారు అంటున్నారు.

**కుటుంబాలకు దూరంగా ఉన్నాం..**

ఆ రోజులు గుర్తుకొస్తే భయం అనిపించేది. ప్రాణాలు సైతం లెక్కచేయకుండా కుటుంబాలకు దూరంగా ఉంటూ కరోనా రోగులకు తమ చేతులతో వైద్యం అందించాం. కరోనా కష్టకాలంలో గాంధీ ఆస్పత్రిలో ఔట్‌సోర్సింగ్ నర్సులు తమ బాధ్యతగా సీనియర్ నర్సులకు తోడుగా డ్యూటీలు చేశామంటున్నారు. న్యాయమైన డిమాండ్ల కోసం పోరాటం చేసిన మాకు ఈ ప్రభుత్వంలో న్యాయం జరిగింది. ఇక్కడ పనిచేసిన ఔట్‌సోర్సింగ్ నర్సులకు పర్మినెంట్ కావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**అమ్మనాన్న, చెల్లి సపోర్ట్ వల్లే నర్సు ఉద్యోగం**

అమ్మనాన్న, చెల్లి సపోర్ట్ వల్లే నర్సు ఉద్యోగిని అయ్యా. తల్లిదండ్రుల రుణం మరిచిపోను. తాను చదువుకున్న రోజుల్లో పడ్డ కష్టం ఈరోజుకు తీరింది. ఔట్‌సోర్సింగ్ నర్సుగా అనేక కష్టాలు పడ్డా. చాలిచాలని జీతాలతో పదిహేడేళ్లు పనిచేశా. నాతో పాటు తోటి నర్సులందరికీ ప్రభుత్వ నర్సులుగా ఉద్యోగాలు రావడం ఇంకా ఆనందం కలిగింది.



- సరళ, సీనియర్ నర్సు


బోర్‌వెల్ పనులను పరిశీలిస్తున్న టీ.ఎన్.శ్రీనివాస్ తదితరులు

## బోర్‌వెల్ పనుల పరిశీలన

సికింద్రాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ పాలనలో నగరంలో జరిగిన అభివృద్ధిని చూసి రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజిగిరి నియోజకవర్గంలో ప్రజలు బీఆర్‌ఎస్‌ని గెలిపించడం ఖాయమని బోయినపల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్ అన్నారు. కంటోన్మెంట్ రెండో వార్డు గన్‌బజార్‌లో స్థానిక ఎమ్మెల్యే లాస్య నందిత చొరవతో శనివారం ప్రారంభించిన బోర్‌వెల్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో స్థానికులకు ఇచ్చిన హామీ మేరకు బోర్‌వెల్ పనులు చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో రఘురామన్, ఆంజనేయులు, నాగరాజు, శ్రీహరి, ప్రవీణ్, నర్సింహ, ప్రకాష్, గణేష్, శ్యాం పాల్గొన్నారు.

## ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలి

- కార్పొరేటర్ సామల హేమ


సీతాఫల్‌మండి చౌరస్తాలో ట్రాఫిక్ పోలీసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ హేమ

బౌద్ధనగర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి చౌరస్తాలో భూగర్భ డ్రైనేజీ పనులు చేపడుతున్నందున ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని డివిజన్ కార్పొరేటర్ సామల హేమ ట్రాఫిక్ పోలీసులను కోరారు. శనివారం సీతాఫల్‌మండి చౌరస్తాలో కార్పొరేటర్ ట్రాఫిక్ పోలీసులతో ట్రాఫిక్ సమస్యపై చర్చించారు. సుమారు రూ.36లక్షలతో జోషికాంపౌండ్ నుంచి సీతాఫల్‌మండి చౌరస్తా వరకు భూగర్భ డ్రైనేజీ పనులు నిర్వహిస్తున్నామని, పనులు జరిగే సమయంలో వాహనదారులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ అన్విత్ పాల్గొన్నారు.

## సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ బలోపేతానికి కృషి


సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సృజన్

సికింద్రాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వివరించినట్టు ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదం సృజన్ చెప్పారు. శనివారం రేవంత్‌రెడ్డిని కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రానున్న లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, సికింద్రాబాద్ లోక్‌సభ సీటును హస్తగతం చేసుకునేందుకు ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించామని తెలిపారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఉత్సాహంతో పార్టీ శ్రేణులు ఉన్నాయని, లోక్‌సభ ఎన్నికల్లో విజయం కోసం శ్రమిస్తున్నారని పేర్కొన్నారు.



మూత్రశాలలు ఏర్పాటు చేయాలని ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు

## మూత్రశాలలు ఏర్పాటు చేయాలి

అడ్డగుట్ట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): లేబర్ అడ్డాలో మూత్రశాలలు వెంటనే ఏర్పాటు చేయాలని సీఐటీయూ సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి టి. మహేందర్ డిమాండ్ చేశారు. శనివారం తుకారాంగేట్ చౌరస్తాలో లేబర్ అడ్డా వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. తుకారాంగేట్‌లో దాదాపు 800 మంది భవన నిర్మాణ కార్మికులు అడ్డా కూలీలుగా ఉన్నారని వారికి ఇక్కడ ఎలాంటి మరుగుదొడ్డి సౌకర్యం లేదన్నారు. మూత్రశాలలు వెంటనే ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆర్ మల్లేష్, రవి, రమేష్, రాజునాయక్, కృష్ణ, లక్ష్మమ్మ, వెంకటమ్మ, పర్శరాములు, రాంబాబు, సోమేష్, శ్రీను, మహ్మద్, మల్లేష్, వెంకటమ్మ పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న వెల్‌బేబీ షో



చిన్నారికి బహుమతి అందజేస్తున్న డాక్టర్

చిలకలగూడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే మహిళా శిశు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో లాలాగూడ కేంద్రీయ ఆస్పత్రిలో శనివారం నిర్వహించిన వెల్‌బేబీ షో ఆకట్టుకుంది. బోసి నవ్వులు.. పాలు కారే బుగ్గలు.. బుడిబుడి నడకలతో 70మంది చిన్నారులు ఈ షోలో పాల్గొన్నారు. పిల్లల ఆరోగ్యం, బరువు, ఎత్తు, వ్యాధి నిరోధక టీకాలు తదితర అంశాలు పరిగణనలోకి తీసుకుని బహుమతులు అందజేశారు. సంఘం ఉపాధ్యక్షురాలు శ్రీలత ధనుంజయ మాట్లాడుతూ పిల్లల పెంపకంలో జాగ్రత్తగా వ్యవహరించాలని అనారోగ్యంగా ఉంటే డాక్టర్లను వెంటనే సంప్రదించాలని సూచించారు. అనంతరం 20వీల్ చైర్లు, 10వాటర్ ఫిల్టర్లు ఆస్పత్రికి విరాళంగా అందజేశారు. ప్రధాన కార్యదర్శి మంజులిక శర్మ, ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సీ.కె. వెంకటేశ్వర్లు, మెడికల్ డైరెక్టర్ నిర్మల రాజారాంలు పిల్లల పెంపకంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.

## మల్కాజిగిరి బీజేపీ టికెట్ కేటాయించాలి

- పార్టీ రాష్ట్ర జాయింట్ ట్రెజరర్ విజయ్ సురానా


బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న విజయ్‌సురానా

మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశాన్ని పార్టీ తనకు కల్పించాలని ఆపార్టీ రాష్ట్ర జాయింట్ ట్రెజరర్, స్వచ్ఛంద సంస్థ సేవా నాయకుడు విజయ్ సురానా అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలోని ఏవోసీ గేట్ సమీపంలో బీజేపీ ఎన్నికల కార్యాలయాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను మల్కాజిగిరి, కంటోన్మెంట్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్, ఎల్బీనగర్ ప్రాంతాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించానని తెలిపారు. సమావేశంలో ఉమేష్, విజయ్ పాల్గొన్నారు.

మారేడ్‌పల్లిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో షిరిడీ సాయిబాబా సన్నిధిలో శనివారం జైగురుదత్త అనఘాష్టమి వ్రతం అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు ఆలయ అర్చకులు యోగేష్ తెలిపారు.

- మారేడ్‌పల్లి, ఆంధ్రజ్యోతి



## మల్కాజిగిరిలో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం : భద్రారెడ్డి


మల్లారెడ్డి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ భద్రారెడ్డి

బోయినపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమని మల్లారెడ్డి ఆస్పత్రుల అధిపతి, మల్కాజిగిరి నుంచి బీఆర్‌ఎస్ తరఫున ఎంపీ టికెట్ ఆశిస్తున్న మల్లారెడ్డి కుమారుడు డాక్టర్ భద్రారెడ్డి పేర్కొన్నారు. తాను ఎంపీగా గెలవడానికి ఎమ్మెల్యేగా మర్రి రాజశేఖర్‌రెడ్డి, మేడ్చల్ ఎమ్మెల్యేగా మా నాన్న మల్లారెడ్డి అండదండలతో పార్టీ ఎంపీగా తనను గెలిపిస్తాయని అన్నారు. మల్లారెడ్డి సేవా ట్రస్ట్ సహకారంతో కంటోన్మెంట్ నియోజకవర్గంలోని గన్‌బజార్ కమ్యూనిటీ హాలులో స్థానిక కంటోన్మెంట్ నాయకుడు బోయినపల్లి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో మెఘా ఉచిత వైద్యశిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ భద్రారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఉచిత మెఘా వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్ ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడానికి జనరల్ మెడిసిన్, కంటి పరీక్షలు, ఈసీజీ, దంత పరీక్షలు, గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ శిబిరంలో 476మంది రోగులు పరీక్షలు చేయించుకోవడానికి ముందుకు వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కుమార్ ముదిరాజ్, దేవులపల్లి శ్రీనివాస్, శ్యాంరెడ్డి, ప్రవీణ్, అజ్జు, బిక్షపతి, ప్రకాష్, మహేష్ పాల్గొన్నారు.

వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయడానికి తనకు అవకాశం కల్పించాలని కోరుతూ శనివారం ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ గాంధీ భవన్‌లో దరఖాస్తును అందజేశారు.



- తార్నాక, ఆంధ్రజ్యోతి

## సమర్థవంతంగా నడుస్తున్న సికింద్రాబాద్ పీజీ కళాశాల

- ప్రిన్సిపాల్ జాస్తి రవికుమార్

సికింద్రాబాద్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సికింద్రాబాద్ పీ.జీ.కళాశాలను సమర్థవంతంగా నడుపుతున్నామని కళాశాల ప్రిన్సిపాల్ జాస్తి రవికుమార్ తెలిపారు. కళాశాల ఆవరణలోని మహిళా హాస్టల్ చుట్టూ గట్టి భద్రతను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. శనివారం కళాశాలలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల మహిళా హాస్టల్‌లో కొందరు అగంతకులు ప్రవేశించిన నేపథ్యంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసినట్టు తెలిపారు. సీసీ కెమెరాల సంఖ్యను పెంచడంతోపాటు, హాస్టల్‌ను ఆనుకుని ఉన్న హాస్టల్ భవనం-కంటోన్మెంట్ పంప్‌హౌస్ మధ్యనున్న ప్రహరీ ఎత్తును పెంచనున్నట్టు వెల్లడించారు. ప్రధాన రహదారిలో ఉన్న మెట్రో స్టేషన్ మెట్ల నుంచి, భవన ప్రహరీలో కొద్ది భాగం వరకు రేకుల షీట్లు ఏర్పాటు చేయడానికి మెట్రో రైల్ ఎండీ ఎన్.వీ.ఎస్.రెడ్డి అంగీకరించారని, కొద్ది రోజుల్లోనే పనులు ప్రారంభించనున్నారని జాస్తి రవికుమార్ వివరించారు. కాగా కళాశాల, హాస్టల్ డిస్పెన్సరీలో డ్రెస్సర్/కంపౌండర్‌గా 2018 నుంచి సంతోషిణి అనే ఉద్యోగి పని చేస్తున్నారని చెప్పారు. ఔషధాల కొనుగోలులో ఎటువంటి అవకతవకలు జరగడం లేదని, విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని చెప్పారు. 250 మందితో పీ.జీ.కళాశాల మహిళా హాస్టల్‌లో అన్ని సదుపాయాలు కల్పించామని తెలిపారు. గతంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉండే పీ.జీ.కళాశాల విద్యార్థినులు ప్రస్తుతం కళాశాలలోని హాస్టల్ భవనంలో ఉంటుండడంతో తల్లిదండ్రుల ఆనంద పడుతున్నారని అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ మృదుల పాల్గొన్నారు.


టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన రమేష్‌ను హైదరాబాద్ ఎస్సీ సెల్ కన్వీనర్ రాంలీల మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సంక్షేమ పథకాలపై ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నామని సికింద్రాబాద్‌లో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని ఆమె తెలిపారు.

- అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి



ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు కొనసాగించరాదు అంటూ ప్లకార్డులను ప్రదర్శిస్తున్న మారేడ్‌పల్లి ట్రాఫిక్ సిబ్బంది

## ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు కొనసాగిస్తే చర్యలు

- ఎస్‌ఐ రాంచందర్‌నాయక్

మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పాదచారులు నడిచే ఫుట్‌పాత్‌లపై చిరు వ్యాపారాలు కొనసాగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మారేడ్‌పల్లి ట్రాఫిక్ ఎస్‌ఐ రాంచందర్‌నాయక్ హెచ్చరించారు. శనివారం జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా వెస్ట్ మారేడ్‌పల్లి ప్రధాన మార్గంలో ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది, పాదచారులతో కలిసి ప్లేకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఫుట్‌పాత్‌లపై చిరు వ్యాపారాలు కొనసాగిస్తూ పాదచారులు నడవడానికి వీలు లేకుండా వ్యాపారులు కారణం అవుతున్నారని పేర్కొన్నారు. దీంతో రద్దీ ప్రదేశాల్లో పాదచారులతో పాటు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆయన అన్నారు. చిరు వ్యాపారులు ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని వ్యాపారాలు కొనసాగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మారేడ్‌పల్లి ట్రాఫిక్ ఎస్‌ఐలు సంజీవరెడ్డి, మహేష్, హరీష్, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## కోదండరామ్‌పై విమర్శలు చేస్తే సహించేది లేదు


మాట్లాడుతున్న తెలంగాణ ప్రాంతీయ ఉద్యమసమితి నేతలు

బౌద్ధనగర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుడు, ప్రొఫెసర్ కోదండరామ్‌పై బీఆర్‌ఎస్ నాయకులు విమర్శలు చేస్తే సహించేదిలేదని తెలంగాణ ప్రాంతీయ ఉద్యమసమితి నేతలు హెచ్చరించారు. శనివారం బౌద్ధనగర్ కార్యాలయంలో సమితి ఫౌండర్ గుండా యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో తెలంగాణ ప్రాంతీయ ఉద్యమసమితి చైర్మన్ డాక్టర్ ఎం.భాగయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రొఫెసర్ కోదండరామ్ ఎమ్మెల్సీ పదవిని అడ్డుకునేందుకు బీఆర్‌ఎస్ నాయకులు కుట్రలు పన్నుతున్నారన్నారు. కోదండరామ్‌కు సముచిత స్థానం కల్పించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ఇప్పుడు వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుడిని గుర్తించి ఎమ్మెల్సీ పదవిని ఇస్తే బీఆర్‌ఎస్ ఓర్వలేక లేనిపోని విమర్శలు చేస్తుందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో నాయకులు యాదగిరి, పాండుగౌడ్, శంకరయ్య, వీరస్వామి, జనార్దన్‌రెడ్డి, సాయిబాబా, సత్యనారాయణ, గణేష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఆటో చోరీ

అడ్డగుట్ట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పార్కుచేసి ఉన్న ఆటోను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన ఘటన తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. రైల్ నిలయం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన ఎర్రబెల్లి ఉపేందర్‌కు చెందిన ఏపీ 10యూ 7839 నెంబరు గల ఆటోను రైల్ నిలయం పక్కనే ఉన్న పెట్రోల్ బంకు వద్ద శుక్రవారం రాత్రి పార్కింగ్ చేసి ఇంటికి వెళ్లిపోయాడు. తిరిగి శనివారం ఉదయం వచ్చేసరికి ఆటో కనిపించలేదు. వెంటనే బాధితుడు తుకారాంగేట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని మహిళ మృతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ : కదులుతున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఓ గుర్తు తెలియని మహిళ అక్కడికక్కడే మృతిచెందిన ఘటన బీబీనగర్ రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని 40ఏళ్ల మహిళ రైలులో ప్రయాణం చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు ఘట్‌కేసర్ - బీబీనగర్ రైల్వేస్టేషన్ సమీపంలో రైలు నుంచి జారి కింద పడింది. రైలు చక్రాల కింద పడడంతో బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

## గుంతను తప్పించబోయి జీప్ పల్టీ..!

- మల్లారెడ్డి కాలేజీ విద్యార్థుల్లో ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు

పేట్ బషీరాబాద్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ఉన్న గుంతను తప్పించబోయి ఓపెన్ టాప్ జీప్ పల్టీ కొట్టిన ఘటనలో బీటెక్ విద్యార్థి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన నాగరాజు(21) మైసమ్మగూడలోని వసతి గృహంలో ఉంటూ, మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(ఎంఆర్‌సెట్)లో బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. కళాశాలలో ఫెస్ట్ ఉన్నందున అద్దెకు తెచ్చుకున్న ఓపెన్ టాప్ జీప్‌లో సాయిచరణ్, నాగరాజు, దిలీప్, చరణ్ సిద్ధార్థ్ కలిసి మైసమ్మగుడి నుంచి దూలపల్లి మీదుగా మైసమ్మగూడకు వెళ్తుండగా ఫారెస్ట్ అకాడమీ మార్గం మధ్యలో రహదారిపై ఉన్న గుంతను తప్పించబోయిన చరణ్ సిద్ధార్థ్ జీప్‌ను లెఫ్ట్‌కు తిప్పడంతో పల్టీ కొట్టింది, దీంతో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్ర గాయాల పాలైన నాగరాజును సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. 100 ఫోన్ నెంబరు ద్వారా విషయం తెలుసుకున్న పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. బాధిత విద్యార్థులు చదువుతున్న మల్లారెడ్డి కళాశాలకు రెండ్రోజుల పాటు యాజమాన్యం సెలవు ప్రకటించింది.

## కేన్సర్ కేసులు పెరుగుతున్నాయి

- ఎఫ్‌టీసీసీఐలో కేన్సర్ సదస్సులో వైద్యులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా కేన్సర్ కేసులు పెరుగుతున్నాయని, భారతదేశంలో గత సంవత్సరం 19 నుంచి 20 లక్షల కేన్సర్ కేసులు నమోదయ్యాయని ఆంకాలజిస్ట్ డాక్టర్ కళ్యాణ్ పోలవరపు పేర్కొన్నారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా శనివారం రెడ్‌హిల్స్‌లోని ఎఫ్‌టీసీసీఐలో, మూడు సంస్థలు ఎఫ్‌టీసీసీఐ, తెలంగాణ లయన్స్ క్లబ్‌లు, తెలంగాణ, ఆంధ్రా ప్లాస్టిక్ తయారీదారుల సంఘం (టాప్మా)తో కలిసి ప్రపంచ కేన్సర్‌ని జయిద్దాం అనే థీమ్‌తో సెమినార్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ కళ్యాణ్ పోలవరపు మాట్లాడుతూ పశ్చిమ దేశాలలో లాగా మన దగ్గర కేన్సర్ జాతీయ రిజిస్ట్రీ లేదని, కాబట్టి కేసుల సంఖ్య ఖచ్చితంగా తెలియదని అన్నారు. నోటిలో పుండు మూడు వారాల్లో నయం కాకపోతే వైద్యులను సంప్రదించాలన్నారు. భారతదేశంలో కేన్సర్ స్క్రీనింగ్ 5 శాతం కంటే తక్కువగా ఉందని డాక్టర్ కళ్యాణ్ చెప్పారు. లయన్స్ క్లబ్‌ల అంతర్జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ పట్టి హిల్ మాట్లాడారు. కార్యక్రమంలో లయన్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఆర్.సునీల్ కుమార్, డాక్టర్ పవన్ కుమార్ బీ, డాక్టర్ హరీష్ ఎస్ఎల్, డాక్టర్ ప్రనేత్, ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు మీలా జయదేవ్, టీఏపీఎంఏ అధ్యక్షుడు దయాకర్, శేఖర్ అగర్వాల్, లయన్ డాక్టర్ ప్రకాశరావు, లయన్ తీగల మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన ఫీజులు తగ్గించాలి..

- కోఠి మహిళా విశ్వవిద్యాలయం ఎదుట ధర్నా
- దిగివచ్చిన వీసీ.. ఫీజులను తగ్గిస్తున్నట్లు ప్రకటన


వర్సిటీ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థినులు

మంగళ్‌హాట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పెంచిన ఫీజులను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ కోఠి మహిళా కళాశాల విశ్వవిద్యాలయం విద్యార్థినులు రోడ్డెక్కారు. శనివారం విశ్వవిద్యాలయం ప్రధాన గేటు వద్ద ధర్నా నిర్వహించారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీలో సైతం లేనివిధంగా కోఠి మహిళా విశ్వవిద్యాలయంలో పరీక్ష ఫీజులను 10శాతం పెంచి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. మారుమూల ప్రాంతాల నుంచి చదువుల కోసం నగరానికి వచ్చిన విద్యార్థులపై ఫీజుల భారం మోపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కనీస సమాచారం లేకుండా ఏకంగా 10 శాతం ఫీజుల పెంచడం సరికాదన్నారు. పెంచిన ఫీజులను వెంటనే తగ్గించడంతోపాటు హాస్టల్‌లో వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం విశ్వవిద్యాలయం వీసీ విజ్జులత విద్యార్థులతో చర్చించి పెంచిన ఫీజుల తగ్గిస్తున్నట్లు ప్రకటించడంతోపాటు హాస్టల్‌లో వసతులు కల్పిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థినులు ధర్నా విరమించారు.

## రూకీస్ సర్టిఫైడ్ కాలేజీగా ఐఏసీజీ మల్టీమీడియా కాలేజీ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ఇంటర్నేషనల్ అకాడమీ ఆఫ్ కంప్యూటర్ గ్రాఫిక్స్ (ఐఏసీజీ) ఇప్పుడు రూకీస్ సర్టిఫైడ్ స్కూల్‌గా ప్రపంచస్థాయి గుర్తింపు పొందింది. జూబ్లీహిల్స్‌లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఐఏసీజీ ఫౌండర్ రామకృష్ణ పోలిన మాట్లాడుతూ.. ఈ సర్టిఫికేషన్‌ను భారతదేశంలో సాధించిన ఒకే ఒక్క ఇనిస్టిట్యూట్‌గా తాము చరిత్ర సృష్టించామన్నారు.

## ఉద్యోగ భద్రతను కల్పించాలి..


ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ ఆలీకి వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

తార్నాక, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని అన్ని యూనివర్సిటీలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఉద్యోగ భద్రతను కల్పించాలని కోరుతూ తెలంగాణ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ ఆలీ, రెవెన్యూమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు డా.పరుశరాం మాట్లాడుతూ కాంట్రాక్ట్ అధ్యాపకులకు రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా హెల్త్‌కార్డులు, మహిళలకు మెటర్నిటీ సెలవులు, క్యాజువల్ సెలవులు వంటి సదుపాయాలను కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు డా. ప్రేమయ్య, డా. పరమేశ్, సర్దార్, జాస్పల్ సింగ్, డా. తిరుపతి పాల్గొన్నారు.